ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కనకదుర్గ సారె యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ చందు



ఎల్వీనగర్‌లో మహిషాసుర మర్దినిగా కనకదుర్గ



త్రిశక్తి దేవాలయంలో అమ్మవార్లకు ఊంజల్ సేవ



త్రిశక్తి దేవాలయంలో విజయలక్ష్మి అవతారంలో..



వాసీవా భవనం వద్ద దుర్గాదేవి పూజల్లో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు

గాజువాక: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 70వ వార్డు ఎల్వీ నగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించు కున్నారు. భవానీ భక్తులు అమ్మవారి సేవలో నిమగ్నమయ్యారు. ఉత్సవ నిర్వాహకులు భారీస్థాయిలో పూజలను నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

కనకదుర్గ అమ్మవారి సారె ఊరేగింపు

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా డ్రైవర్స్ కాలనీలో కనకదుర్గ అమ్మవారికి భక్తులు సారెను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు భారీ సంఖ్యలో సారెతో ఊరేగింపుగా డ్రైవర్స్ కాలనీలోని కనకదుర్గ ఆలయం వరకు తరలి వెళ్లారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు ప్రారంభించడంతో పాటు ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణంరాజు, పల్లా రమణ, అచ్చిబాబు, జనార్దన్, గణేష్, ఐఎస్ఎన్ రాజు, దొరబాబు, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి రూపంలో దుర్గాలమ్మ అమ్మవారు

అగనంపూడి: దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా ఆదివారం అగనంపూడిలోని దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలోని దేవతామూర్తి దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీలు అమ్మవార్ని దుర్గాదేవి అవతారంలో అలంకరింపజేసి భక్తులకు దర్శనం కల్గించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని కుంకుమ పూజలు చేశారు. భక్తులు చీరలు, సారె అమ్మవారికి సమర్పించారు. వాటిని లక్కీడిప్ నిర్వహించి తిరిగి భక్తులకు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ సారధ్యంలో కమిటీ ఏర్పాట్లు చేసింది.

వాసీవా ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీయలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా), ఐలా సంయుక్తంగా దసరా మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం వాసీవా భవనం వద్ద దుర్గా దేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆటోనగర్‌కు చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. తొలిపూజలో మాజీ హెచ్‌పీఎంసీ మెంబర్ సర్వసిద్ధి సత్యబాబు, ప్రమీలా, పి.శ్రీనివాస్, సరిత దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రాం ప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, పలువురు వాసీవా ప్రతినిధులు, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, కోశాధికారి పద్మావతి, కార్యదర్శి రామకృష్ణ రాజు, మాజీ ప్రతినిధులు ఆట్లూరి రమేష్, బీజేపీ మూర్తి, కొల్లి సత్యనారాయణ, బాపిరాజు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి అమ్మవార్లకు ఊంజల్‌సేవ

ఉక్కునగరం: త్రిశక్తి ఆలయంలో ఆదివారం శ్రీమహాదుర్గ, శ్రీమహాలక్ష్మి, శ్రీమహాసరస్వతి అమ్మవార్లకు ఊంజల్ సేవ (ఉయ్యాల సేవ) ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవార్లకు వేకువజామున నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం అమ్మవార్లకు నవరసాభిషేకాలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా శ్రీమహాదుర్గకు సహస్ర గులాబీ పుష్పార్చన నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీమహాదుర్గ అమ్మవారు ముదురు ఎరుపు వర్ణం చీరలో దుర్గాదేవి అవతారం, శ్రీమహాలక్ష్మి అమ్మవారు గులాబీ వర్ణం చీరలో విజయలక్ష్మి అవతారం, శ్రీమహాసరస్వతి అమ్మవారు కాషాయ వర్ణం చీరలో బ్రహ్మచారిణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు.ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దసరా సందడి

పెదగంట్యాడ: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మండపాల వద్ద ఆదివారం పెద్ద ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. ఈసరపువానిపాలెంలో అన్న సమారాధనను వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ప్రారంభించారు. 74వ వార్డు పరిధిలోని సిద్దేశ్వరంలోని కొండపై కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ఆదివారం ఘటాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గొరుసు సత్యారావు, చిన అప్పారావు, అప్పలరెడ్డి పాల్గొన్నారు.జీవీఎంసీ 76వ వార్డు పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ పంచాయతన ఆలయలో దుర్గాష్టమి హోమాలు చేశారు.



వాసవీ పంచాయతన ఆలయంలో దుర్గాష్టమి హోమంలో పాల్గొన్న భక్తులు

విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సైనింగ్ బ్లూస్ టీమ్ ఆర్గనైజర్ జెర్రిపోతుల సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 25 వరకూ నిర్వహించనున్న విండ్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, అండిబోయిన లక్ష్మి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఉత్సాహంగా పాల్గొని ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. పెదకోరాడ గ్రౌండ్‌లో ప్రారంభించిన ఈ టోర్నీలో మొత్తం 43 జట్లు పోటీ పడుతున్నాయి. ఈ కార్యక్రమంలో అండిబోయిన అప్పారావు, రోజారాణి, యువశ్రీ, గొందేశి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కొమరం భీమ్‌కు ఘన నివాళి



కొమరం భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా మహాబోధి సొసైటీ సభ్యులు

పెదగంట్యాడ: గిరిజనోద్యమ నాయకుడు కొమరం భీమ్ సేవలు మరువలేమని జిల్లా మహాబోధి సొసైటీ సభ్యుడు బోర వేణుగోపాల్ గౌతమ్ అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ కూడలిలో కొమరం భీమ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ విముక్తి కోసం నిజాం సర్కారు నవాబుపై గెరిల్లా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాటాలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకేటి పెంటయ్య, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గోవిందరావు, ములకలపల్లి చిన్నారావు, కె.అన్నవరం పి సిద్దార్ధ్, గంట్యాడ పైడికొండ తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల అన్నసమారాధనలు



87వ వార్డులో అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: గాజువాక నియోజకవర్గ పరిధిలోని 87వ వార్డులోని పలు ప్రాంతాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి గవరవీధిలో శ్రీ దుర్గ గౌరీ యూత్ ఆధ్వర్యంలోనూ, దుర్గాదేవి ఆలయంలో కణితి గవర సేవా సంఘం ఆధ్వర్యంలోనూ, వడ్లపూడి మీసేవా గ్రౌండ్స్‌లో శ్రీ రధాలమ్మ శెట్టి బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలోనూ నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలో భాగంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. నిర్వహకులు ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్ధ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాస రావు, వార్డు అధ్యక్షులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, కాంద్రేగుల అప్పలనాయుడు, ఆడారి శ్రీనివాస్, మద్దుపు దామోదర్, దుగ్గపు దానప్పలు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

69వ వార్డులో..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని శ్రీ లలితాశాంతి దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకొని ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన అన్నసమారాధనను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, ఆలయ కమిటీ కార్యదర్శి ఎ.వీర్రాజు, కోశాధికారి కె.దామోదరరావు, ప్రతినిధులు కె.మోహనరావు, బి.నరసింహారావు, కె.జి.మురళీధర్, బి.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సైనికులు దూసుకుపోవాలి

బస్సుయాత్ర సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఓ వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరో వైపు అభివృద్ధి వికేంద్రీకరణ నినాదంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలనే ఉద్దేశంతో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ప్రచార పర్వంలోనూ, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడంలోనూ జగనన్న సైనికులు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరింత కాలం ముఖ్యమంత్రిగా ఉండాలంటే నాయకులు, కార్యకర్తలు ముఖ్యభూమిక పోషించాలని కోరారు. ఈ నెల 28న 65వ వార్డు పరిధిలోని వికాస్ నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో పార్టీ సమావేశాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హాజరు కానున్నారని చెప్పారు. ఈ సమావేశానికి వార్డు కార్పొరేటర్లు, పార్టీ ఇన్‌చార్జులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. అలాగే వచ్చే నెల 6వ తేదీన సాయంత్రం 4 గంటలకు మంత్రుల బస్సుయాత్ర పాత గాజువాక జంక్షన్‌కు చేరుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమానికి సుమారు 20వేల మంది తరలివచ్చి ఘనంగా స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు తిప్పల దేవన్‌రెడ్డి, కోమటి శ్రీనివాసరావు, రోజారాణి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, మండల అధ్యక్షులు రాజాన వెంకటరావు, ధర్మాల శ్రీను, బొడ్డ గోవింద్, క్లస్టర్ ఇన్‌చార్జి మంగరాజు, డైరెక్టర్లు యువశ్రీ, ప్రమీల, నాయకులు వై మస్తానప్ప, దొడ్డి రమణ, మంత్రి శంకరనారాయణ, వెంపాడ అప్పారావు, పల్లా పెంటారావు, నాగిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమల బాలాజీకి సహస్రనామార్చన



పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సహిత తిరుమల బాలాజీ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీకు నిత్య విశేష పూజలు నిర్వహిస్తున్నారు. దసరా శరన్నవరాత్రులు పుణ్యదినాలను పురస్కరించుకొని ఆదివారం ఆలయంలో శ్రీ దేవి, భూదేవి సహిత తిరుమల బాలాజీకు సహస్రనామార్చన నిర్వహించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

విశాఖ ఉక్కు దేశ ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనం

కూర్మన్నపాలెం: భారత దేశ ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనమైన విశాఖ ఉక్కు పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ప్రజలకు తీవ్ర అభ్యంతరాన్ని కలిగిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 983వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆర్చి సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసుల సమాచారం మేరకు వివరాలివి.. పశ్చిమ గోదావరి జిల్లా పెనుమదం ప్రాంతానికి చెందిన కంది వెంకట ఉదయ కిరణ్ (49) అనకాపల్లిలో టాటా మోటార్స్‌లో పని చేస్తూ స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని సెక్టార్-3లో తన కుటుంబంతో నివశిస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వెంటనే కిరణ్ అపస్మారక స్థితికి చేరుకున్నారు. అక్కడే ఉన్న ఒక యువకుడు అతనికి సీపీఆర్ చేయగా కొంత తేరుకున్నారు. అనంతరం అంబులెన్స్‌లో గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

కూర్మన్నపాలెం: ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ 87వ వార్డు పరిధి మీ సేవా వద్ద గల ఫిష్‌మార్కెట్‌లో ఆదివారం పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరు ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, పరమానందం, కామరాజు, వసంతరెడ్డి, సన్యాసిరావు, రాజేంద్రనాథ్, మూర్తి పాల్గొన్నారు.

డ్రైవర్ మృతి



మృతుడు ఆదినారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్ -7 కూడలి వద్ద కల్వర్ట్‌లోకి ఆటో దూసుకుపోయిన సంఘటనలో డ్రైవర్ మృతి చెందగా..మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. పెందుర్తి సమీప పెదగాడికు చెందిన పసల ఆదినారాయణ (48) ఆటోలో రోజు స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని రైతు బజార్‌కు సరకులు రవాణా చేస్తుంటాడు. ఆదివారం ఉదయం కూడా రైతు బజారుకు సరకులు తెచ్చాడు. తిరిగి వెళ్తూ ఓ ప్రయాణికుడ్ని ఎక్కించుకున్నాడు. సెక్టార్-7 కూడలి వద్దకు వచ్చే సరికి ఆటో అదుపు తప్పి రోడ్డు పక్క ఉన్న కల్వర్ట్‌లోకి దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ ఆదినారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు.